నవతెలంగాణ
మహబూబ్‌నగర్
సోమవారం | ఫిబ్రవరి 12, 2024 | www.navatelangana.com

గజఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలి :ఎమ్మెల్యే



మహబూబ్ నగర్ : ఈత లో నైపుణ్యం కలిగిన నిపుణులను అందుబాటులో ఉంచుకోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానం ఆవరణలో ఆదివారం ఈత కొలను ను ఆవిష్కరించి ఆయన నిర్వాహకులకు శుభా కాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిలో పట్టణ ప్రజలు ఈ క్రీడా మైదానం లోని ఈత కొల నుకు వస్తారన్నారు. వేసవిలో చిన్నారులకు ఆటవిడుపు గా ఉంటుం దన్నారు. అదేవిధంగా ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. ఈతలో నైపుణ్యం కలిగిన గజ ఈత గాళ్ల అనుక్షణం అలర్ట్ గా ఉండేవిధంగా చూసుకోవాలన్నారు.చిన్నారులు ఈత కొలనులో ఉన్న ప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీని వాస్, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్,ఆజ్మత్ అలి,అవేజ్, సుధాకర్ రెడ్డి, యం.డి.ఇద్రీస్,నిర్వాహకులు మథీన్ తదితరులు పాల్గొన్నారు

బాలస్వామికి విశ్వగురు వరల్డ్ రికార్డు అవార్డు అందజేత



మహబూబ్ నగర్ : సామాజిక సేవలు చేసిన వారిని గుర్తించి ఇచ్చే విశ్వ గురు వరల్డ్ రికార్డు అవార్డును సన్నాతన బాలస్వామి అందు కున్నారు. ఆదివారం హైద రాబాదు బేగంపేట్ లోని టూరిజం ప్లాజా హోటల్లో జరిగినటువంటి విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అవార్డ్స్ వివిధ ప్రాంతాల నుంచి వివిధ కేట గిరీలలో విశ్వగురు సంస్థ అవార్డ్స్ ను ఇచ్చారు. ముఖ్యఅతిథిగా ఇ.వి. వేణు గోపాల్ తెలంగాణ హైకోర్టు జస్టిస్, అథితులుగా లక్ష్మీకాంతం మాజీ ఐఏఎస్, నిరెళ్ల మాల్యాద్రి జిల్లా న్యాయవాది పాల్గొని సందేశం ఇచ్చారని తెలిపారు. విశ్వ గురు వరల్డ్ రికార్డ్ సంస్థ వ్యవస్థాపకులు సత్యవోలు రాంబాబు మాట్లాడుతూ సనాతన బాలస్వామి అనేక సోషల్ కార్యక్రమాలలో చాలా చురుకుగా పాల్గొంటారని ఉద్యోగ సంఘాలలో తనదైన శైలిలో నాయకునిగా గుర్తింపు పొందాలని అందుకే విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అవార్డ్ 2024 అందించామన్నారు.

ఆస్ట్రేలియాలో మల్లా బార్ షోరూం ప్రారంభం

నవ తెలంగాణ- మహబూబ్ నగర్



బంగారు అండ్ గోల్డ్ వ్యాపా రములు జాతీయ అంతర్జాతీయంగా పేరుగాంచిన మల్లాబార్ అండ్ గోల్డ్ షోరూం ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో లిటిల్ ఇండియా ఆవ రణంలో షోరూం బ్రాంచ్‌ని ప్రారం భించినట్లు గోల్డ్ అండ్ డైమండ్ ఇంటర్నేషనల్ ఆపరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ షాములాల్ అహ్మద్ తెలిపారు. ఆదివారం ఆస్ట్రేలియన్ క్రికెటర్ బ్రేటు లి తో కలిసి ఆయన ఈ షోరూమును ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లా బార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ మా సొంత దేశం భారతదేశంలో బంగారు గోల్డ్ వ్యాపారంలో ఎంతో పేరుగాంచిన మా సంస్థ అంతర్జాతీయంగా 13 దేశాల్లో 340 షోరూములు ప్రారంభించి వినియోగదారులకు ఉత్తమమైన, నాణ్యమైన ఆభరణాలు అందిస్తున్నామని తెలిపారు.ఆస్ట్రేలియా దేశంలో మొట్టమొదటి భారతీయ బంగారు ఆభరణాల బ్రాండ్ షోరూముగా చరిత్ర సృష్టించిందని వారు తెలిపారు. ప్రపంచ వేదికపై భారతీయ ఆభరణాలు కళారూపాలు ప్రదర్శించడం దేశానికి గర్వకారణమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వివిధ దేశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

పార్టీ ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ : ఎమ్మెల్యే

నవ తెలంగాణ మహబూబ్ నగర్



కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసమే పనిచేస్తుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం మహ బూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్ ఫంక్షన్ హాలు లో బీఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు శంకర్, యాదయ్య, నారాయణ, వెంక టయ్య, నాయకులు స్థానిక ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇక బీఆర్ఎస్ పార్టీ ఉండదని, బిఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అవుతున్న పార్టీ అని ఆయన అన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాల వల్ల మహబూబ్ నగర్ ప్రజలు ఎన్నో విధాలుగా నష్టపోయామన్నారు. విద్య ,వైద్యం పూర్తిగా సంక్షోభంలో పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వేల సంఖ్యలో ఉపాధ్యాయ ఖాళీలు ఉన్న ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా నింపలేదన్నారు. గురుకులాల పేరున విద్యావ్యవస్థ ను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆయన మండిపడ్డారు. మొన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం లో తొలి సారిగా ప్రవేశపెట్టిన బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్రం విద్య వైద్యమే కాదు, అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ పట్టణాన్ని అందరం కలిసి అద్భుతంగా అభివృద్ధి చేసుకుందామని ఆయన చెప్పారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడి, లక్ష కోట్ల రూపాయల తో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టితే, మేడిపండు చూడ అన్న చందంగా తయారైంది అని ఎద్దేవా చేశారు. పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బిఆర్ఎస్ పార్టీది అని, ఆ పార్టీ నాయకుడిదే అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నలుగురి ఉద్యోగాలు ఊడగొట్టినందుకు, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు వస్తున్నాయి అని ఆయన చెప్పారు. ఎలాంటి భేషజాలకు పోకుండా మహబూబ్ నగర్ ను అద్భుతంగా అభివృద్ధి చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కొత్త పాత అనే విషయాన్ని మరిచిపోవాలని, అందరూ కలిసి మెలిసి పార్టీని బలోపేతం చేసేందుకు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ఎన్ పి వెంకటేష్, మాజీ మహిళ అధ్యక్షురాలు బెక్కరి అనిత, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, చంద్రకుమార్ గౌడ్, మారేపల్లి సురేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, ఆజ్మత్ అలి, అవేస్, జహీర్, నాగరాజు, సుధాకర్ రెడ్డి, శంకర్, వెంకటేష్ గౌడ్, నారాయణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా "ఎన్ ఇన్వాల్యుబుల్ ఇన్వొకేషన్" పుస్తకావిష్కరణ

నవ తెలంగాణ- మహబూబ్ నగర్



ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ప్రసిద్ధ రచయిత, లిమ్కా, గిన్నిస్ వరల్డ్ రికార్డుల గ్రహీత, అనువాద రచయిత, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి రచించిన " ఎన్ ఇన్వాల్యుబుల్ ఇన్వొకేషన్ " పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా పరిషత్ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వశాంతిని కోరి శ్రీనాథాచారి రచించిన ఈ పుస్తకం ప్రపంచ ప్రసిద్ధి పొందాలని ఆకాంక్షించారు. ప్రపంచంలో ఉన్న అనేక సమస్యలను తన పుస్తకంలో ఆవిష్కరించిన తీరు ప్రశంసనీయమన్నారు. ఇప్పటికే అనేక గిన్నిస్ వరల్డ్ రికార్డులను సొంతం చేసుకున్న శ్రీనాథాచారి రచించిన ఈ పుస్తకం గిన్నిస్ రికార్డ్ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రముఖ ఆకాశవాణి రీడర్ డాక్టర్ సమ్మెట నాగమల్లేశ్వరరావు పుస్తక సమీక్ష చేస్తూ ప్రపంచ సాహిత్య చరిత్రలో ఇప్పటివరకు ఇలాంటి గొప్ప పుస్తకం రాలేదన్నారు. ఈ పుస్తకాన్ని పది విభాగాలుగా రచించారన్నారు. విశ్వశాంతిని కోరి రచించిన ఈ పుస్తకం ప్రపంచంలో పెద్ద పెద్ద రికార్డులు సాధిస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ విద్యావేత్త కె.లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ పాలమూరు జిల్లాకు చెందిన వంగీపురం శ్రీనాథాచారి ప్రపంచస్థాయి పుస్తకాన్ని రచించడం జిల్లాకు గర్వకారణమన్నారు. అనేక అంతర్జాతీయ అవార్డులను పొందిన శ్రీనాథాచారి ప్రపంచశాంతిని కోరే దిశగా పుస్తకాన్ని రచించడం గొప్ప విషయమన్నారు. పుస్తక రచయిత డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి మాట్లాడుతూ ముప్పై సంవత్సరాల అనుభవంతో, మూడు సంవత్సరాల కఠోర దీక్షతో ఈ పుస్తకాన్ని రచించానన్నారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న అనేక సమస్యలను ఇందులో ఆవిష్కరించానన్నారు. ఏ దేశంలోనైనా సమస్యలన్నీ ఒకటేనని వాటిని పరిష్కరించబడాలనే ఉద్దేశ్యంతో ఈ పుస్తకాన్ని రచించానన్నారు. ప్రపంచ సాహిత్య చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన సంబోధనాత్మక భావగీతంగా ఈ పుస్తకాన్ని రచించడం జరిగిందన్నారు. ఈ పుస్తకం అమ్మగా వచ్చిన డబ్బులో మొత్తం ఐక్యరాజ్య సమితి వారికి యాభై శాతం, భారతదేశానికి ఇరవైఐదు శాతం , తెలంగాణ ప్రభుత్వానికి ఇరవైఐదు శాతం చెల్లిస్తానన్నారు. ఇందులో ప్రపంచంలోని 197 దేశాలలోని సమస్యలను 237 కవితలలో ఆవిష్కరించానన్నారు. కార్యక్రమ సమన్వయకులు, పాలమూరు సాహితి అధ్యక్షులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ వంగీపురం శ్రీనాథాచారి రచించిన ఈ పుస్తకానికి అనేక అంతర్జాతీయ అవార్డులు వస్తాయని, పాలమూరు కీర్తిపతాక ప్రపంచ స్థాయిలో రెపరెపలాడుతుందన్నారు. అనంతరం వంగీపురం శ్రీనాథాచారిని మెమెంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళ సాహిత్య, సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు రావూరి వనజ, రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, మాజీ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్. విజయకుమార్, సీనియర్ సిటిజన్ ఫోరమ్ అధ్యక్షులు జగపతిరావులతో పాటు జిల్లాలోని కవులు, రచయితలు, పాల్గొన్నారు.

సమ్మెకు సమాయత్తం

- కార్మిక శ్రేయస్సు కోసం 16 న బంద్
- గ్రామీణ బంద్ ద్వారా కేంద్రం మెడలు వంచాలని సంఘాల పిలుపు
- కేంద్ర ప్రజా వ్యతిరేక విధనాలపై కార్మిక సంఘాల ఐక్య ఉద్యమాలు


(ఫైల్ ఫోటో)

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా గ్రామీణ బందు కార్మికుల సమ్మెకు యావత్ శ్రామిక లోకం సమాయతం అవుతున్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటినుండి అనుసరిస్తున్న కార్మిక విధానాలు ఆర్థిక మత తత్వ విధానాలకు వ్యతిరేకంగా సమ్మె చేయడానికి అన్ని రంగాల వారు సంసిద్ధులు అవుతున్నారు. సమ్మెలో సీఐటీయూ, ఎఐటియూసీ, ఐఎన్‌టీయూసీ, తదితర సంఘాలు ,వాటి అనుబంధ సంఘాలు సైతం సమ్మెలో పాల్గొంటున్నాయన్నారు. ఈనెల 16న జరిగే సమ్మెకు బీజేపీ మినహ రాజకీయ పార్టీలన్నీ సంపూర్ణమద్దతు ఇస్తున్నాయి.

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి



దేశంలో అసమగ్రంగా ఉన్న వ్యవసాయ కార్మికుల కోసం ఒక సమగ్ర చట్టం తేవాలి. దేశంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టం నీర్వీర్యం అవుతోంది. ఉపాధికి 2 లక్షల కోట్లు కెటాయించాలి. 11 కోట్ల బకాయిలు ఉన్నాయి. వీటిని వెంటనే చెల్లించాలి. గత బడ్జెట్‌లో 8600 కోట్లు కెటా యించారు. ఇవి ఏమూలకు సరిపోవు. ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసమే నిధులు తగ్గించారు. ఆధార్ కార్డు ద్వారానే వేతనాలు ఇవ్వడం సరికాదు. పని ప్రదేశాలలో డ్రోన్ కేమెరాతో పర్యవేక్షణ చేయడం భావ్యం కాదు. ఇటువంటి సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న సమ్మెలో ఉపాధి కార్మికులు అంతా పాల్గొనాలి.

కడియాల మోహన్,
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

దేశభక్తి పూరితమైన సమ్మె



దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్మిక సమ్మె గ్రామీణ బంద్ దేశభక్తి పూరితమైనది. దేశసావలంబన కోసం దేశంలో ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు ఆసంపదలో భాగ స్వామ్యం లేకుండా పోయింది. సంపద మొత్తం బడా పారిశ్రామిక వెత్తలు, పెట్టుబడి దారుల చేతుల్లోకి వెళ్తుంది. కార్మికుల శ్రమను దోచు కుంటూ... కుబేరులు అవుతున్నారు. పేదోడికి నిలువ నీడ లేకుండా చేస్తున్న బీజేపీకి సమ్మె ద్వారా తగిన బుద్ధి చెప్పాలి. కార్మికులకు పర్మి నెంటు, కనీస వేతనాల చట్టం వంటివి అమలు చేయాలి. ముఖ్యంగా 12 నుంచి 8 పని గంటలను తగ్గించాలి. ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ... రిజర్వేషన్లను కాపాడుకోవాలి

కురుమూర్తి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహబూబ్‌నగర్

ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



దేశంలో ఎప్పుడూ లేనంతగా ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రబుత్వ ప్రధాన రంగాలను ప్రయివేటు చేసి ఉద్యోగులను రోడ్డున పడేస్తున్నారు. ముఖ్యంగా లభాలు వచ్చే రంగాలను అధాని అంబానీలకు దోచి పెడుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రతి ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని పది లక్షల ఉద్యోగస్తులను రోడ్డున పడేసింది. కార్మిక చట్టాలను రద్దు చేసి వారికి బద్రత లేకుండా చేస్తోంది. లాబాలు వచ్చే ప్రభుత్వ రంగ సంస్థలయిన బిఎస్ఎన్ఎల్ రైల్వే, వీమానయానం, ఓడరేవులు తదితర వాటిని ప్రయివేటు చేసి ఆధానీ అంబానీలకు కోట్ల రూపాయలను దోచి పెడుతున్నారు. అందుకే ఈనెల 16 జరిగే సమ్మెకు ప్రతి ఉద్యోగి, కార్మికులు అంతా ఐక్యమత్యంతో సమ్మెలో పాల్గొనాలని కోరుతున్నాం

రామ్మోహన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మమబూబ్‌నగర్

సమ్మెలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి



ఈనెల 16 జరిగే కార్మిక సంఘాల సమ్మె గ్రామీణ బందుకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలి. ముఖ్యంగా కేంద్రంలో అధికారాన్ని వెలగబెడుతున్న బీజేపి విధానాలు కార్మికులకు గొడ్డలి పెట్టుగా మారాయి. కార్మికుల త్యాగాలు, అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 8 గంటల పనిదినాలు గాకుండా 12 గంటలకు పెంచి కార్మికులపై భారాన్ని మోపింది. ముఖ్యంగా రాజ్యాంగ సవరణ చేయడం ద్వారా మతతత్వ విధానాలకు రూపకల్పన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంటుంది. కార్మిక చట్టాల సవరణ, లేబర్‌కోడ్‌ల రద్దు చేయాలి. కనీస మద్దతు ధర తదితర డిమాండ్లపై సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం.

వెంకటస్వామి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, గద్వాల

నాలుగు కోడ్‌లను రద్దు చేయాలి



కేంద్రం ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను సవరించి 4 కోడ్‌లను తెచ్చింది. ఇది కార్మిక లోకానికి గొడ్డలి పెట్టులాంటిది. దేశంలో అసంగటిత కార్మికులు 40 కోట్లమంది ఉన్నారు. వీరంతా అబద్రతలో పనిచేస్తున్నారు. వీరికి ఏళ్ల తరబడి పనిచేసినా.. పని పద్రత, పీఎఫ్, ఇఎస్ఐ వంటి కనీస సౌకర్యాలు లేవు. గతంలో ఏడు మంది ఉంటే సంఘం పెట్టుకునే అవకాశం ఉం దేది. ఇప్పుడు 20 మంది ఉంటేనే సంఘం అనే నిబంధన తెచ్చారు. కనీస వేతన చట్టం ద్వారా నెలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి.ఇంకా రైతులు,అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం తేవాలి. వీటికోసం జరుగుతున్న సమ్మెను ప్రతి ఒకరు జయప్రదం చేయాలని కోరుతున్నాం.

వెంకటేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

ఆర్టీసిని రక్షించండి ... కార్మికుల ప్రయోజనాలను కాపాడండి



కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు కార్మికులకు గొడ్డలి పెట్టుగా మారాయి. మోటార్ వేహికిల్ చట్టం సవరణ 2019ని తీసుకొచ్చింది. అగ్రిగేటర్స్ అనే సెక్షన్‌ను చేర్చింది. పోటీని పెంచే పేరుతో వాహనం మరియు రూట్ పర్మిట్ నిబంధనలను మినహాయించింది. స్టేజీ క్యారేజీలను ఒకే పర్మిట్ విధానం కిందకు తీసు కొచ్చింది. ఇటువంటి చర్యల వల్ల ఇప్పటికే తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆర్టీసీ మరింత సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయి. బస్సులకు వచ్చే నష్టాన్ని ఆర్టీసిల ఆధాయం నుండి భర్తీ చేసి ప్రయివేటు బస్సు యజమానులకు ఆర్టీసి సొమ్మును దోచిపెట్టి మరింత ఆర్టీసిని నష్టాలకు కారణం అవుతున్నారు.అందుకే కార్మికులు ఈనెల 16 జరిగే కార్మిక సమ్మె గ్రామీణ బందుకు ఆర్టీసీ కార్మికులు సమ్మెలో పాల్గొనాలి.

వీరాంజనేయులు, ఎస్‌బ్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం : ఎస్ఎఫ్ఐ

నవ తెలంగాణ- మహబూబ్ నగర్



తెలంగాణ రాష్ట్ర విద్యారంగం పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సందర్భంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా లేదని ఎస్ఎఫ్ఐ మహబూబ్ నగర్ జిల్లా కమిటీ అభిప్రాయ పడినట్లు జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. ఆదివారం తెలంగాణ చౌరస్తాలో నిరసన చేశారు. ఈ సందదర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్లో 21,389 కోట్ల రూపాయల విద్యారంగానికి కేటాయించారు. 500 కోట్ల నూతన ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటుకు, 500 కోట్ల రూపాయలు ప్రభుత్వ యూనివర్సిటీల నిర్వ హణకు, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ పాఠశాలలకు సొంత భవనాలకు 1546 కోట్ల రూపాయలు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ,1000 కోట్ల రూపాయలు సాంఘిక సాంఘిక సంక్షేమ, 250 కోట్ల రూపా యలు, గిరిజన సంక్షేమ పాఠశాలల నూతన భవనాల ఏర్పాటు కొరకు తక్కువ కేటాయింపులు చేశారని అన్నారు. శాఖల వారీగా నూతన భవనాల నిర్మాణం కోసం కేటాయించిన మొత్తం ఏమాత్రం సరిపోదన్నారు. ఈ బడ్జెట్ తో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణం కల నెరవేరుటట్లు లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న అద్దె భవనాలకు నెలకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. 650 పై చిలుకు గురుకులాలు అద్దె భవనాల్లో ఉన్నట్లు తెలిపారు. పాఠశాల,ఉన్నత విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం మౌళిక సదుపాయాల కల్పనకు కేటాయించిన బడ్జెట్ ఏ మాత్రం సరిపోదని తెలిపారు.రాష్ట్రంలో 7800 కోట్ల రూపాయల పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయన్నారు. వెంటనే చెల్లించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో రాష్ట్ర విద్యారంగంలో నెలకొన్న సంక్షోభాన్ని గాలికొదిలేసింది. తక్షణమే విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించకపోతే భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్, నాయకులు నందు, రాము, రామాంజనేయులు, సురేష్, నరేష్,శ్రీనాథ్ ,బాలకృష్ణ, శ్రీధర్. తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

- ఫిబ్రవరి 16 కార్మిక సమ్మెకు రాజకీయ పార్టీల మద్దతు

నవ తెలంగాణ- మహబూబ్ నగర్



బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదామని, బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలని వామపక్ష పార్టీలు నాయకులు తెలిపారు.ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రాములు, సీపీఐ జిల్లా నాయకులు పరమేశ్వర్ గౌడ్, సీపీఐ ఎంఎల్ ప్రజా పంత నాయకులు సి వెంకటేష్ ,బీఎస్పీ జిల్లా నాయకులు ఆది లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సాయిబాబాలు హాజరై ప్రసంగిస్తూ మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, వ్యవసా యకార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న జరిగే సమ్మెకు ఆయా పార్టీలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు నాయకులు ప్రకటించారు.కార్యక్రమంలో సీఐ టీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, జిల్లా కార్య దర్శి నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్ ,వెంకటేష్ గౌడ్, గోనెల ఆంజనేయులు, ఐఎఫ్‌టీయూ నాయ కులు బాలు,ఏఐటీయూసీజిల్లా కార్యదర్శి రామ్మోహన్ ,నాయకులు భాగ్యలక్ష్మి, ఆనందు, సునీల్ కుమార్, కృష్ణయ్య ,ముజాహిద్ సాయిలు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ :కేంద్ర ప్రభుత్వం అవలం బిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం వెంకటేష్ గౌడ్ లు అన్నారు.ఆదివారం మండల కేంద్రంలో సమ్మె గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్ల గడిచిన రైతంగా,కార్మిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఈనెల 16వ తేదీన సమ్మెలో ప్రతి కార్మికులు అందరూ పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టయ్య, వెంకటయ్య, చంద్రమ్మ, వెంకటమ్మ, రాములు, సంజమ్మ పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై శీతల పానీయాలు ?

- వేసవి రాకముందే దిగుతున్న శీతల పానీయాలు.
- రకరకాల పేర్లతో వస్తున్న శీతల పానీయాలు

నవతెలంగాణ - బాలానగర్

వేసవి రాకముందే నకిలీ నిలబడెల్స్ శీతల పానీయాలు జాతీయ రహదారిపై ఉన్న బాలానగర్ మండలంలో శీతల పానీయాలు నీల రకరకాల పేరుతో వస్తున్న నీల బాటల్స్ వస్తున్నాయని వినియోగదారులు తెలిపారు.ఇటుపక్క నకిలీ బాటిల్స్ రకరకాల పేరుతో ఉన్న శీతల పానీయాలు కూల్ డ్రింక్స్. కొబ్బరి బోండాలు. వస్తున్నాయన్నారు. గల్లి నుంచి ఢిల్లీ వరకు ఈ నీళ్లదందా ఎక్కువగా జరుగుతుంది ప్రయాణికుల అవసరాన్ని నిమిత్తం పెద్ద బాటిల్స్ నుండి చిన్న బాటిల్స్ చేస్తూ ధరలను పెంచేస్తున్నారు. 20 రూపాయల నుండి 200 రూపాయల వరకు శీతల పానీయాలు వ్యాపారస్తులు అమ్ముతున్నారని వారు ఆరోపించారు. .ఎక్కడి నుండి వస్తాయో ఎవరికీ తెలియదు లారీల కొద్దీ లారీలు దింపుకుంటున్నారు.ప్రతి ఒక్కరు 20 రూపాయలు పెట్టి బాటల్ కొని తాగి పడేస్తున్నారు .ఈ రకరకాల నిలబాటల్లో ఏ రసాయనాలు కలుపుతారు ఎన్ని రోజుల కింద తయారవుతున్నాయో ఎవరికీ తెలవదు .వేసవి రాకముందే సమయంలో కూల్ కూల్ వాటర్ అని వినియోగదారులు అడిగి తీసుకుంటున్నారు..

ఒక్కొక్కరికి ఐదు కిలోలు ఉచిత బియ్యం ?



నవతెలంగాణ - బాలానగర్

తెలంగాణ రాష్ట్రంలో రేషన్ షాప్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఆహారంలో వినియోగదారులకు చౌక ధర దుకాణం ద్వారా 9 వస్తువులు డీలర్లు సరఫరా చేసేవారు .నేడు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైనప్పటినుండి కేవలం కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఒక్కొక్కరికి ఐదు కిలోలు చొప్పున ఉచిత బియ్యాన్ని సర్పంచి చేస్తున్నారు. గతంలో బియ్యంతో పాటు పామ్ ఆయిల్ ,కిరసనాయిల్. ఉప్పు, పప్పు, చింతపండు సబ్బులు రకాల వస్తువులు దేశం ద్వారా సరఫరా చేసేవారు.నేడు కేవలం ఉచితంగా బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. బయోమెట్రిక్ ద్వారా ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది రకాల వస్తువులను రేషన్ షాప్ ద్వారా సరఫరా చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమమే టీఎస్ యూటీఎఫ్ లక్ష్యం

నవ తెలంగాణ- మహబూబ్ నగర్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమానికై టీఎస్ యూటీఎఫ్ ఎల్లవేళలా కృషి చేస్తుందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య ఉద్ఘాటించారు. ఆదివారం టీఎస్ యూటీఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా కమిటీ విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అధ్యక్షతన ఆర్వీఎం హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ఎనిమిదేళ్ళుగా ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. టీఎస్ యూటీఎఫ్ పక్షాన ఉందన్నారు. ఉమ్మడి పోరాటాల ఫలితంగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ వివిధ కోర్టు వివాదాల కారణంగా ఆగిపోయిందన్నారు. కనుక కొత్త ప్రభుత్వం వీటన్నిటిని పరిష్కరించి పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర బాధ్యులు ఎస్. కిష్టయ్య, జిల్లాప్రధాన కార్యదర్శి. రవికుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామదాసు ,జిల్లా ఉపాధ్యక్షులు ప్. ఉమాదేవి, . నర్సింహులు , జిల్లా కోశాధికారి భాస్కర్,జిల్లా కార్యదర్శులు మణ్యం,రాములు, కనకమ్మ ఎస్. హేమంత్ కుమార్, డి. అజయ్, ఎ. సుదర్శన్, కె. తిరుపతమ్మ కె. కిష్యా నాయక్, ఎస్. వెంకటయ్య, ఎం. కృష్ణయ్య,ఆడిట్ కమిటీ కన్వీనర్ శివరాజ్,రాష్ట్ర కార్యదర్శులు ఎం. వేణుగోపాల్, సృజన, శ్రీనివాసులు,ట్రెమ్రీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జవెద్,వివిధ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయంతి,గంట శ్రీనివాస్,నరేష్, నాగయ్య, ఎల్లప్ప,ఎ. నాగమద్దిలేటి, రమేష్, శ్యామ్,ఎస్. గోపాల్,మొగులయ్య,ఖాదరయ్య తదితరులు పాల్గొన్నారు.



15, 16 తేదీలలో కొల్లాపూర్‌లో క్రీడలు

నవతెలంగాణ - వీపనగండ్ల

ఫిబ్రవరి 17న సంత్ సేవాలాల్ మహారాజ్ 285 జయంతి , మహా బోగ్ బండార్ సందర్భంగా ఫిబ్రవరి 15 ,16 కొల్లాపూర్ పట్టణంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని గిరిజన సంఘం నాయకులు రామ్ చందర్ నాయక్, గోపాల్ నాయక్, శివుడు నాయక్, నారాయణ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు . మండలంలోని గిరిజన తండాల నుంచి క్రీడలు ఆడాల్సిన ఆసక్తి కలిగిన యువకులు టీంల కోసం నమోదు చేసుకోవాలని నిర్వహణ కమిటీ పేర్కొంది. క్రీడల్లో పాల్గొనడానికి ఆసక్తి కలిగిన యువకులు సెల్. 9912808183, 9177391673, 961873 2 378, 9 4 9 2 9 5654 1లను సంప్రదించాలని కోరారు.

వీపనగండ్ల ఎస్ఐగా నందికర్

నవతెలంగాణ - వీపనగండ్ల



వీపనగండ్ల నూతన ఎస్సైగా నందికర్ ఆదివారం పోలీస్ స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రవి ప్రకాష్ వనపర్తి ఎస్పీ కార్యాలయానికి వీఆర్ కావడం జరిగింది. గద్వాల జిల్లా గట్టు ఎస్ఐగా పని చేసిన నందికర్ బదిలీపై వీపనగండ్లకు రావడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేయడం జరుగుతుందని మండల ప్రజలు సహకరించాలని కోరారు.

10 విద్యార్థులు.... 100 శాతం

- పాఠ్య పుస్తకాల వారిగా బిట్స్ రూపంలో పుస్తకాలు
- పరీక్షలకు 20వేల మంది విద్యార్థులు సన్నద్ధం
- ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు
- ఒత్తిడిని దూరం చేసేందుకు దోహదం
- విద్యార్థులకు ప్రభుత్వ ప్రైవేటు సంస్థల అవగాహన టెస్టులు

ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు పరీక్షలలో 100శాతం ఉత్తీర్ణత కోసం ప్రత్యేక ప్రణాళికతో అడుగులు వేస్తున్నది... పాఠశాల విద్యతోనే విద్యార్థుల చదువు ఆగిపోకూడదనే ఆలోచనతో వారి రేపటి భవితకు పాఠశాల విద్య నాంది కావాలని పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు తప్పిపోకూడదని ప్రత్యేక కార్యాచరణను చేపడుతున్నది... అల్పాహారం ఏర్పాటు చేస్తూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ... ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు పరీక్షలపై అవగాహన టెస్టులు.మార్చి 18 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలపై ప్రత్యేక కథనం.



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

తెలంగాణ ప్రభుత్వం విద్యా శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. విద్యార్థుల భవిష్యత్తు కోసం 'మన ఊరు-మన బడి' కింద సకల సౌకర్యాలను కల్పిస్తున్నది. ఇంగ్లిష్ మీడియాన్ని అందుబాటులోకి తెచ్చి కార్పొరేట్‌కు దీటుగా విద్యనందిస్తున్నది. పదో తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. ఈసారి జిల్లాలోని 70 ప్రభుత్వ 140 ప్రైవేటు పాఠశాలల నుంచి 20000 మంది విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిత్యం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ అల్పాహారాన్ని అందిస్తున్నారు. ఈ ఏడాది మహబూబ్ నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విద్యాయాత్ర పేరుతో ఎమ్మెల్యే తన ఖర్చులు పెట్టి డిజిటల్ బిట్స్ బుక్ రూపొందించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ పంపిణీ చేశారు. జిల్లాలో ఎస్ఎఫ్ఐ బిబిటి రామయ్య రూపొందించిన పదవ తరగతి టాలెంట్ టెస్ట్ పరీక్షలు ప్రతి ఏడాది మాదిరిగా ఈసారి కూడా నిర్వహించడానికి సిద్ధం అవుతున్నది.ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో అడుగులు వేస్తున్నది. పాఠశాల విద్యతోనే విద్యార్థుల చదువు ఆగిపోకూడదనే ఆలోచనతో వారి రేపటి భవితకు పాఠశాల విద్య నాంది కావాలని పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు తప్పిపోకూడదని ప్రత్యేక కార్యాచరణను చేపడుతున్నది. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ 100 శాతం వారు ఉత్తీర్ణత సాధించేలా పకడ్బందీ ప్రణాళికతో అధికార యంత్రాంగం ముందుకు సాగుతున్నది. పాఠశాలలో తరగతుల నిర్వహణ అనంతరం, సాయంత్రం వేళ విద్యార్థులు ఆకలితో అలమటించకుండా అల్పాహారం అందిస్తున్నది. విద్యార్థులకు ఎప్పటికప్పుడు టెస్టులు నిర్వహించి, అధ్యయనంలో వెనకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నది. విద్యార్థులకు పాఠ్యాంశాలలో పట్టు సాధించేలా పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు.

100శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా....జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఈ యేడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే ధ్యేయంగా పెట్టుకొని విద్యా శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి సంవత్సరం పెరుగుతున్న విద్యార్థులకు అనుగుణంగా ఫలితాలు ఉండేలా జిల్లా అధికార యంత్రాంగం కార్యాచరణ చేపట్టింది. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తున్నది. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నది. అధ్యయనంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించి క్లిష్టమైన పాఠ్యాంశాలను తిరిగి అర్థమయ్యేలా బోధిస్తున్నది. చాలా పాఠశాలల్లో ఇప్పటికే సిలబస్‌ను పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో ఉన్న భయాందోళనను పోగొడుతున్నారు. విద్యార్థుల భవితవ్యంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.నేపథ్యంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో ఉన్న భయాందోళనను పోగొడుతున్నారు. విద్యార్థుల భవితవ్యంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతివారం టెస్టులు : ప్రతి విషయంలో ఆయా పాఠ్యాంశాలపై వారాంతంలో విద్యార్థులకు స్లిప్ టెస్టులను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ప్రత్యేకంగా ప్రశ్నలు రూపొందించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యాధికారి ఆధ్వర్యంలో గణితంలో విద్యార్థులకు ప్రత్యేకంగా మెళకువలు నేర్పిస్తున్నారు. గణితంపై విద్యార్థుల్లోని భయాన్ని పోగొట్టేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులను ఉత్తీర్ణతకు కృషి చేయాలని డీఈవో సుశీందర్‌రావు సూచిస్తున్నారు. స్లిప్, ప్రీ ఫైనల్ టెస్టులు పూర్తయిన వెంటనే సమాధాన పత్రాలను దిద్ది ఇవ్వడం ద్వారా మరుసటి టెస్ట్‌కు వెనుకబడిన విద్యార్థులను సన్నద్ధం చేసేలా సలహాలు, సూచనలు జారీ చేశారు. దీని ద్వారా విద్యార్థుల్లోని లోటుపాట్లను ఉపాధ్యాయులు సవరించే అవకాశం ఏర్పడుతుంది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట అదనపు తర గతులు నిర్వహిస్తున్నారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం నిర్వహించే పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం అందిస్తున్నది. దీని ద్వారా దూర ప్రాంతాల విద్యార్థులు ప్రత్యేక తరగతులకు పూర్తిస్థాయిలో హాజరు కానున్నారు. అల్పాహారం ఇవ్వడమే కాకుండా విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు మోటివేషన్ తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంచి ఉత్తీర్ణత సాధించాలని అధికారులు సూచిస్తున్నారు.

విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం....



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్షలకు ఉప యోగపడే అన్ని రకాల పుస్తకాలు బిట్స్ పుస్తకాలు అందుబాటులో ఉంచాం. ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి చొరవతో రూపొందించిన డిజిటల్ కి పుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. పరీక్షల సమయంలో ప్రభుత్వం ఆర్టీసీతో మాట్లాడి విద్యార్థులు రాసే సెంటర్ల వరకు బస్సులు నడిపే విధంగా చర్యలు చేపట్టాం. పరీక్ష కేంద్రాల దగ్గర మంచినీటి సౌకర్యం ఎంతో సమస్యలు వస్తే చూసుకోవడానికి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నాం. పరీక్షలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిర్వహిస్తాం 100 శాతం ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి వనపర్తి

ఆర్థికసాయం అందజేత



నవతెలంగాణ - వీపనగండ్ల

మండల కేంద్రానికి చెందిన సంజన్న బైక్ ప్రమాదంలో ఇటీవల అకాల మరణం చెందారు. 1996 ,97 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు చిన్ననాటి మిత్రుని జ్ఞాపకాలు స్మరించుకుంటూ తాము పోగుచేసిన రూ.66,500 ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవిష్యత్‌లో కూడా తోటి మిత్రుని కుటుంబసభ్యులకు ఇబ్బందులు కలగకుండా తమ వంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తోటి మిత్రులు నాగేష్, రాజు, రాముడు , మద్దిలేటి కృష్ణయ్య, ఈశ్వరయ్య , బీరయ్య ,తిరుపతయ్య, పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం మహబూబ్‌నగర్ కందూరు రాంరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యం నిర్వహిస్తున్నట్లు తిపుడంపల్లి ఆసుపత్రి వైద్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కంటి శిబిరం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ శిబిరంలో పాల్గొనే వారు 50 సంవత్సరాలు పైబడిన వారు చూపు మందగించిన వారు ఆధార్ కార్డు ,రేషన్ కార్డు జిరాక్స్ తీసుకొని వచ్చి పరీక్షించుకోవాలని సూచించారు . ఈ అవకాశాన్ని ఆత్మకూరు ,అమరచింత, నర్వ, చిన్న చింతకుంట, మండలాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ - ఆత్మకూరు

అమర చింత మండలంలోని మస్తీపురం గ్రామం నుంచి జూరాల ప్రాజెక్టు వరకు నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రజాప్రతినిధులు ,అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ దారులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గౌడ సంఘం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ , పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, అమర చింత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సత్యన్న, మహేందర్, శ్రీధర్ , మునెప్ప, రఫిక్, టీ.ఆంజనేయులు, సుదర్శన్, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

నవ తెలంగాణ వెల్దండ

వెల్దండ మండల కేంద్రంలోని ఏవిఆర్‌గార్డెన్ లో ఆదివారం నియోజకవర్గ గౌడ సంఘం క్యాలెండర్ ను గౌడ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్ బాలస్వామిగౌడ్ , మట్ట వెంకటయ్యగౌడ్ లు ఆవిష్కరించారు. పిలుపునిచ్చారు. కల్వకుర్తి తాలూకా, మండల నూతన క్యాలెండర్ ను గౌడ సంక్షేమ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షుడు చుక్క అల్లాజిగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌడ సంఘం నాయకులు మాట్లాడారు. గౌడ కులస్తులు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీలో ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు పార్టీలను పక్కకు పెట్టి రాజకీయాల కతీతంగా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. గౌడ కులస్తుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరు ఏకతాటిపైకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, బాలస్వామి గౌడ్ , మండల ఉప అధ్యక్షులు నాగరాజు గౌడ్ ,మాడుగుల మండల గౌడ సంఘం అధ్యక్షులు నరసింహ గౌడ్, తాలూకా జేఏసీ కన్వీనర్ సదానందం గౌడ్, యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, రుకుల్ గౌడ్, పర్వతాలు గౌడ్, మట్టవిష్ణు గౌడ్, సెయి బాబు, రఘు,భరత్ గౌడ్, నాగార్జున , మదన్ గౌడ్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు డిఎన్ఆర్ ఆర్థిక సాయం..

నవతెలంగాణ - ఊరుకొండ

ఊర్కొండ మండలంలోని ఇప్పపహాడ్ గ్రామానికి చెందిన కాసోజు ప్రమీళమ్మ(50) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి(డిఎన్ఆర్) బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ అంత్యక్రియల కోసం బాధిత కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకుల ద్వారా 5వేలు ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా ఊర్కొండ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బండెల యశోధమ్మ(50) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా 5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల ఐఎన్ టీయూసి అధ్యక్షుడు మాధారం శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ యాదయ్య, కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు కానుగుల మల్లేష్, లక్ష్మయ్య గౌడ్, పగడాల బుచ్చయ్య, పగడాల అంజయ్య, పగడాల నారయ్య, రాములు, జంగయ్య, దుబ్బా చిన్న రాజు, అల్లాడి రాజశేఖర్, దుబ్బా నరసింహ్మ, జంగారెడ్డి, గోవిందు శ్రీనివాస్, ఆంజనేయులు, ఓర్సు ఆంజనేయులు, శ్రీకాంత్, రవినాయక్, రాము తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు పెరిగిన రద్దీ

నవతెలంగాణ- పెద్దకొత్తపల్లి

మండల పరిధిలోని నాయనోని పల్లి గ్రామ శివారులో వెలసిన మైసమ్మ దేవత జాతరకు ఈ ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ప్రతి ఆదివారం జరిగే మైసమ్మ జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి కాక ఇతర గ్రామాల నుంచి కూడా మైసమ్మ దేవతకు దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించు కొంటారు. ఈ ఆదివారం హుండీ ఆదాయం 80000 వచ్చిందని దాదాపుగా 9,000 మంది భక్తులు మైసమ్మ దేవతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారని ఆలయ చైర్మన్ గొడుగు శ్రీనివాసులు యాదవ్, ఆలయఈవో రంగారావులు తెలిపారు.

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్ రెడ్డి



నవతెలంగాణ - వీపనగండ్ల

ఫిబ్రవరి 16 నిర్వహిస్తున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్ రెడ్డి కోరారు. మండలంలోని బొల్లారం, కల్వరాల గ్రామాలలో గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం, కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీ ఐ టీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు చేసిన పోరాటం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దాటవేస్తూ రైతుల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో నిధులు పెంచాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ధనవంతులపై పన్నులను విధించాలని, కార్పొరేట్ సంస్థలకు పన్నులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మురళి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వీ కృష్ణయ్య, సీఐటీయూ మండల కన్వీనర్ బాలగౌడ్, రైతు సంఘం నాయకులు ఈశ్వర్, వెంకటేశ్వరగౌడ్ , ఎస్ఎఫ్ఐ నాయకులు రామకృష్ణ , డీవైఎఫ్ఐ నాయకులు నాగరాజు,నవీన్,ప్రజాసంఘాల నాయకులు వెంకటస్వామి, తిరుపతయ్య, రామకృష్ణ, రంగస్వామి, కృష్ణయ్య రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఛలో నల్లగొండ సభను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ - మదనాపురం

కృష్ణా నదిపై తెలంగాణ ప్రాజెక్టులు, నీటి హక్కులను హరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర సంస్థ కేఆర్ఎంబీకి అధికారాలు అప్పగించడం దారుణం అని దేవరకద్ర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దుప్పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నాయకుల సమావేశ ంలో ఆయన మాట్లాడారు. కృష్ణ జలాలను కేంద్రానికి అప్పగిస్తే జరగబోయే దుష్పరిణామాలను ఖండిస్తూ, తెలంగాణ సమాజానికి వివరించేందుకు నల్లగొండ పట్టణంలో ఈ నెల 13న బహిరంగ సభ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో చేపట్టడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటిసి కృష్ణయ్య యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రావణ్ కుమార్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బిట్లి యాదగిరి, మండల కో ఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, మాజీ సర్పంచ్ శివశంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ ప్రవేశ వేడుకల్లో.. మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ - మదనాపురం

మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందిన రాజేందర్ గౌడ్ తండ్రి ఎల్లగౌడ్ నూతన గృహ ప్రవేశ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవరకద్ర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మండల నాయకులతో కలిసి గృహ ప్రవేశానికి హాజరై పూజలు చేశారు. ఆయన వెంబడి జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రావణ్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బిట్లి యాదగిరి, మండల కో ఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, మాజీ సర్పంచ్ శివశంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిని దర్శించుకున్న ప్రముఖులు భక్తులు



నవతెలంగాణ - పెబ్బేరు

పెబ్బేర్ పట్టణంలో చౌడేశ్వరి జాతర సందర్భంగా వివిధ పార్టీల ప్రముఖులు వేలాదిమంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆదివారం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖరరెడ్డి, మాజీ మంత్రి చిన్నారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శివసేనారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణ శ్రీ సాయి, వైస్ చైర్మన్ కర్ర స్వామి, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్ అక్కి సుశీల, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, వివిధ పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక నాయకులు, ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ - మదనాపురం

మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఐదవ తరగతి గురుకుల పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ జీఎస్ రవీందర్ తెలిపారు. సెంటర్ లో 480 విద్యార్థులకు గాను 445 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు. మిగతా మంది గైర్హాజరైనట్లు సూచించారు. వనపర్తి జిల్లాలోని ఆయా గురుకులాల్లో పరీక్షను విద్యార్థులు ప్రశాంతంగా రాశారన్నారు. మంచినీటి వసతి, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా జాగ్రత్తలను గురుకుల సిబ్బంది తీసుకున్నారని పేర్కొన్నారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



నేడు గ్రామంలో కరెంటుకు అంతరాయం

నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

మండల కేంద్రంలో సోమవారం ఉదయం 10గంటల నుండి 2గంటల వరకు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏఈ ప్రదీప్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైవే రోడ్డు పనులు నడుస్తున్నందున కరెంటులో అంతరాయం కలుగుతుందని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ఆదేర్ల కరుణాకర్ రెడ్డి డాక్టరేట్



నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

మండల కేంద్రానికి చెందిన కృష్ణమ్మ, ప్రతాపరెడ్డి కుమారుడు ఆదేర్ల కరుణాకర్ రెడ్డి పాలమూరు యూనివర్సిటీలో గత శతాబ్ది కాలంగా అధ్యాపకుడిగా సేవలు అందిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.మధుమతి పర్యవేక్షణలో కంప్యూటర్ సెల్ఫ్ ఎఫికసీ, కంప్యూటర్ యంక్సైటీ అండ్ ఆటిట్యూడ్ టు వర్డ్స్ ఈ లెర్నింగ్ అమంగ్ బీఎడ్ స్టూడెంట్స్ అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. దీని గురించి ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మధుమతి ఆదేర్ల కరుణాకర్ రెడ్డికి డాక్టర్ బిరుదును అందజేశారు. కరుణాకర్ రెడ్డి విద్యార్థుల పోటీ పరీక్షల కోసం రెండు పుస్తకాలు వ్రాసి పలువురి మన్ననలు పొందారు. జాతీయ-అంతర్జాతయ స్థాయి సేమినార్లలో కూడా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వివిధ ఎంట్రన్స్ పరీక్షలకి గత దశాబ్ద కాలంగా అబ్జర్వర్‌గా పని చేసి మన్ననలను పొందారు. ఈ సందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎల్‌బీ.లక్ష్మీకాంత్, రాథోడ్ కర్ణాకర్‌రెడ్డిని అభినందించారు. విశ్వవిద్యాలయం పరిశోధనలకు సంపూర్ణ సహకారం అందిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్టీ టు వైస్ చాన్సులర్ డాక్టర్ డి.మధుసూద న్ రెడ్డి, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ బషీర్ అహ్మద్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ జంగం విశ్వనాథ్, డాక్టర్ భూమయ్య, పీఆర్ఓ డాక్టర్ ఎస్.ర వికుమార్, డాక్టర్ ఆంజనేయులు, వినోద్ కుమార్, డాక్టర్ విజయలక్ష్మి, జయ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. పెద్దకొత్తపల్లి గ్రామ వాసి ఆదేర్ల కర్ణాకర్ రెడ్డికి డాక్టర్ రావడం గ్రామానికి గర్వకారణమని ఎంపీపీ ప్రతాప్ గౌడ్, మాజీ సర్పం చ్ ఆదేర్ల వెంకటేశ్వర్ రెడ్డి, దండు నరసింహ, ఆయన స్నేహితులు అభినందనలు తెలిపారు.

జగన్‌కు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి

నవతెలంగాణ-తాదూర్



నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ టికెట్ మల్లెపల్లి జగన్‌కు కేటాయించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము పరశరాములు అన్నారు. తాదూరు మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కాం గ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షులు మల్లేపల్లి జగన్ పార్టీలో కియోసీలకంగా పని చేశారన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో న్యాయ వృత్తిని చేపట్టి పార్టీ కార్యకర్తలకు బడుగు బలహీన వర్గాలకు ఎలాంటి ఫీజు లేకుండా న్యాయపరమైన సేవలు కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యకర్తల మనసులో వకీల్ సాబుగా పేరు ప్రఖ్యాంతాలు సంపాదించుకొని అందరి మన్ననలు పొందారని అదేవిధంగా అన్ని వర్గాలను కలుపుకొని వెళ్లే వ్యక్తిగా మంచి పేరు ఉందన్నారు. అలాంటి వ్యక్తికి ఎంపీ టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజార్టీతో ఇంకా పార్టీ శ్రేణులకు ప్రజలకు న్యాయపరమైన సేవలు అందించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అన్యాయం..

- పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సంతోష్

నవతెలంగాణ-వెల్దండ



తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం చేశారని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సంతోష్ అన్నారు. ఆదివారం నవతెలంగాణతో మాట్లడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చి నేడు న్యాయం చేశారని ఆయన ఆరోపించారు. ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన మొత్తం బడ్జెట్ 2,75,891 కోట్లు. విద్యారంగానికి 21,389 కోట్లు, యూనివర్సిటీలకు 500 కోట్లు, పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు 500 కోట్లు అని బడ్జెట్‌లో పేర్కొన్నారు. అంటే మొత్తం బడ్జెట్ రాష్ట్ర బడ్జెట్‌లో ఇది 8.11 నిధులు మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని, మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వంగూరు : మండలంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వం పాఠశాలలో 1988-89లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 35ఏండ్ల తర్వాత ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులను పిలిపించి ఘనంగా సన్మానం నిర్వహించారు. 35ఏండ్ల క్రిందట చదివిన అందరూ కలుసుకొని ఆప్యాయత, ప్రేమ, స్నేహ బంధం, చిలిపి చేష్టలను, మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ చదువుతూనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చు అని, చదివిన తరువాత ఏ పనైనా చేయవచ్చు కానీ చదువు లేకుండా ఎవరు కూడా ముందుకు వెళ్లలేదని గుర్తు చేశారు. బాల్యంలో చదివిన చదువులు ఎంతో తీపి జ్ఞాపకాలకు గుర్తు అని విద్యా ర్థులు నిరూపించారు. అదేవిధంగా జీవితంలో ఎంత ఎదిగినా స్నేహ భావంతో ఉన్నంత మరొక దాంట్లో లేదన్నారు. ఉపాధ్యాయులు విష్ణుమూర్తి, అటెండర్ బలరాం ఘనంగా సన్మానించి పాదాలకు నమస్కరించారు. ఇలాంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఎన్ని పెట్టుకున్న తక్కువేనని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, ధర్మరాజు, జయపాల్ రెడ్డి, మల్లప్ప, రాజా, రంగారావు, నరసింహ, బాలరాజ్, మబ్బు లక్ష్మయ్య, సత్యం, మహమూద్, భక్తవత్సల్, పారిజాత, శ్రీలత, మంజుల, సుచిత్ర, అరుణ, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్ద పీట : మాజీ సర్పంచ్

ఊరుకొండ : ఫిదా బడుగు బలహీన వర్గాల ప్రజల పక్షాన నిలబడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని.. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో సంతృప్తికర నిధులు కేటాయించడం.. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేయడమేనని మాదారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ థ్యాప నిఖిల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన 6గ్యారంటీలకు సరిపడా నిధులు మంజూరు చేయడం తెలంగాణ ప్రజల కలలు సాకారం అయ్యేలా ఉన్నాయయన్నారు. తెలంగాణ పేద ప్రజలకు పక్కా గృహ నిర్మాణాల కోసం ప్రత్యేక నిధులు, విద్యుత్ గృహజ్యోతికి నిధులు కేటాయించడంతో కాంగ్రెస్ ప్రజా ఆమోదయోగ్యమైన ప్రభుత్వంగా ఉందన్నారు. తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయించడం వలన వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. విద్యారంగంలో యూనివర్సిటీలకు నిధులు కేటాయించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్గం సమక్షంలో అధిక నిధులు కేటాయించడం పేద ప్రజలను ధనవంతులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా ఉందని నిఖిల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రివర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాలెం వాసి ప్రతాప్ కౌటిల్యకు డాక్టరేట్



నవతెలంగాణ-బిజినేపల్లి

తమిళనాడు రాజధాని చెన్నైలోని గ్లోబల్ హుమన్ పీస్ యూనివర్సిటీ వారు నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామానికి చెందిన ప్రతాప్ కౌటిల్య సైన్స్‌లో చేసిన విశిష్ట సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను యూనివర్సిటి వైస్ ఛాన్సలర్ ప్రధానం చేసినట్లు సైన్స్ రచయిత, డాక్టరేట్ పట్టా పొందిన ప్రతాప్ కౌటిల్య ఆదివారం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటిలో ఎంఎస్సీ బయో కెమిస్ట్రీ పూర్తి చేసి పాతికేళ్ల పాటు జీవ, రసాయన శాస్త్ర ఉపాన్యాసకులుగా సైన్స్ పాఠాలు బోధించారు. అలాగే పాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీపీడీసీ మెంబర్‌గా సైన్స్ అభివృద్ధికి కృషి చేశారు. సైన్స్ గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్న ప్రతాప్ కౌటిళ్యను జాతీయ పోషకాహార సంస్థ డైరెక్టర్ డాక్టర్ భానుప్రకాష్ రెడ్డి, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శేపూరి నరేష్ బాబు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్ సింగ్, నెలపొడుపు సాహితీ సాంస్కృతిక సంస్థ, వెన్నెల సాహిత్య ఆకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు వనపట్ల సుబ్బయ్య, ముచ్చర్ల దినకర్, కందికొండ మోహన్, వహీద్ ఖాన్, మద్దిలేటి, ఎదిరేపల్లి కాశన్న, కపిలవాయి ఆనంద్, సోమశిల సురేష్‌బాబు, సినీ రచయిత హెచ్.రమేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ విద్యారాణి ఆయనను అభినందించారు.

పెట్రోల్ బంకులో సౌకర్యాలు శూన్యం..

- అధికారుల పర్యవేక్షణ ఉన్నట్టా.. లేనట్లేనా..?

నవతెలంగాణ-ఉప్పునుంతల

ఉప్పునుంతల మండలం లత్తిపుర్ గ్రామం పరిధిలోని హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారి హైవేకి ఆనుకొని కొన్ని సంవత్సరాల నుండి ఏర్పాటు చేశారు. అదే విధంగా నిర్వహణ కొనసాగుతున్న పెట్రోల్, డీజిల్ బంకును వాహనదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. కానీ శ్రీ వెంకట మంజునాథ ఫీలింగ్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ డీలర్స్‌గా ఉన్న బంకులో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించినట్లు కనబడుతుంది. అధికారులు బంకు యజమాని డీలర్లతో ఒప్పందాలు కుదుర్చుకుని ఎలాంటి సౌకర్యాలు లేకున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు వాపోయారు. ఇదే ఆసరాగా పెట్రోల్ బంక్ నిర్వహణ యజమాని పెట్రోల్, డీజిల్ అమ్మకాలతో జోరుగా లక్షలలో ఆదాయం పొందుతూ నిర్వహణ కొనసాగిస్తున్నారు. సౌకర్యంగా పెరుగుతున్న వాహనదారులు, వినియోగదారులకు, ప్రయాణికులకు పెట్రోల్ బంకులలో నిబంధనలకు అనుగుణంగా తూచగా పాటించవలసిన ఉచిత సౌకర్యాలు కల్పించకుండా నిబంధనలు తుంగలో తొక్కి ఏండ్లకొద్దీ నిర్వహణ కొనసాగుతూ వస్తుంది. సంబంధిత శాఖ అధికారుల ఆదేశాలు గతంలో నిబంధనలు నిర్వీర్యం చేస్తున్న బంకులపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడ లేనట్లుగా బంకుల దుస్థితిపై ప్రజా సంఘాలు, వాహనదారులు విసుగెత్తిపోయారు. తాగునీరు, టాయిలెట్లు మాత్రమే ఉన్నట్లు కనిపించాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్వహణ యజమాన్యం తీరు పట్ల వెంటనే స్పందించి వినియోగదారులకు ఉచిత సౌకర్యాలపై పూర్తిగా అవగాహన కల్పించి ప్రతి పౌరుడు హక్కుగా భావించి వినియోగించుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.







సౌకర్యాలు లేనియెడల చర్యలు తీసుకుంటాం..

పెట్రోల్ బంకు నిర్వహణ యజమాన్యం ఉచిత సౌకర్యాలు వాహన వినియోగదారులకు ఉపయోగంగా కల్పించాలి నిబంధనలకు విరుద్ధంగా ఉచిత సౌకర్యాలు లేనట్లయితే పూర్తి విచారణ చేయించి బంకు నిర్వహణ యజమాన్యంపై చర్యలు తీసుకుంటాం.

- డిస్ట్రిక్ సివిల్ సప్లై అధికారి, స్వామి కుమార్

వినియోగదారులకు ఉచిత సౌకర్యాలు కల్పించాలి..

పెట్రోల్ బంక్ యాజమాన్యం నిర్లక్ష్యం వీడి వాహనం వినియోగదారులకు కల్పించాల్సిన ఉచిత సౌకర్యాలు, డీజిల్, పెట్రోల్ వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూసే విధంగా సివిల్ సప్లై అధికారులు చొరవ తీసుకోవాలి. మండ ల పరిధిలో ఉన్న బంక్‌లను క్షణ్ణంగా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకొని వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడాలి.

- ఎస్.మల్లేష్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి

కనిపించని ల్యాండ్ ఫోన్, ఫిర్యాదు పెట్టే, గాలి నింపే యంత్రం, సంబంధిత శాఖ అధికారుల పేర్లు ఫోన్ నెంబర్లు, ఫిల్లింగ్ స్టేషన్ పేరు ప్రదర్శించకుండా నిర్వహణ, దుమ్ముతో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లో 2022 సం,నికే కాలం చెల్లిన మందులు, బిల్లు బుక్‌లో చిరునామా తప్పులు, బంకు పరిధి ఉప్పునుంతల మండలం పేరు లేకుండానే బిల్లు బుక్‌ల తయారీ, ఉప్పునుంతల మార్చిండ్రు సంబంధంలేని డిండిని పేర్కొన్నారు. బంకు నిర్వహణ యజమాని ప్రజలకు సౌకర్యాలు మరిచి పెట్రోల్ డీజిల్ అమ్మకాలే ముఖ్యం అన్నట్లు తెలుస్తావుంది. అవసరానికి విపరీతంగా వాడుతున్న ఇంటికో బైకు, పెరుగుతున్న కార్లు, మరి పెట్రోల్ బంకులలో యజమాన్యం తీరు ఇప్పటికైనా మారదు అని చెప్పుకోవచ్చా..? సౌకర్యాలు లేకపోవడం పట్ల అధికారుల చర్యలు ఎలా ఉంటాయి..? 'పెట్రోల్ బంకులో మన హక్కు ఈ సేవలు ఉచితంగా పొందవచ్చు'. పెట్రోల్ బంకు ఏదైనా వాహనదారులైన లేక ఇతరులు అయినా అంటే వాహనం లేని వ్యక్తులు రోడ్డు మార్గంలో ఎక్కడికైనా వెళ్లిన బంకులలో ఉచితంగా త్రాగునీరు, ప్రధమ చికిత్సగా ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫోన్ సౌకర్యం, టాయిలెట్, వాష్ రూమ్, గాలి యంత్రం, ఫిర్యాదులపెట్టే, ఎండలో సేద తీరడానికి నీడ, రోజుకు 24గంటలు అందుబాటులో ఉండి ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు పెట్రోల్ బంకులకు పెట్రోల్ కు డీజిల్ కి మనం చెల్లించే రూపాయల నుండే కొన్ని పైసలు టాక్సీ రూపంలో బంకు యజమానికి చెల్లిస్తుంటారు.

పెట్రోల్ బంక్‌లో గాలి నింపే యంత్రం లేదు..

పెట్రోల్ బంకులలో సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. గాలి నింపే యంత్రాలు కనిపించిన దాఖలలో లేవు. మధ్యరాత్రి ఎమర్జెన్సీకి హాస్పిటల్ ఇతర అవసరాలకు అనుకోకుండా బైక్‌లో పెట్రోలు అయిపోతే పెట్రోల్ బంక్ యజమాన్యం, సిబ్బంది పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

- గోరటి శ్రీనివాసులు, రాయిచెడు, ఉప్పునుంతల మండలం

రైతుల అభివృద్ధే సహకార సంఘం లక్ష్యం : ఎమ్మెల్యే

- పెద్దూరులో గోదాం, షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

నవతెలంగాణ-తెలకపల్లి

రైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు



పనిచేస్తున్నాయని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు ఆదివారం మండల పరిధిలోని పెద్దూరు గ్రామంలో 1ఒక కోటి 30 లక్షల వ్యయంతో నాబర్డ్ ఏఐఎఫ్ సహకారంతో 2000 మెట్రిక్ టన్నులతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం, షాపింగ్ కాంప్లెక్స్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, నాబర్డ్, ఏఐఎఫ్ సంస్థలు రైతుల అభ్యున్నతికి సహకార సంఘాల ద్వారా ఎన్నో రకాల సంక్షేమ ఫలాలను అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకొని రైతులు అధిక దిగుబడులు సాధించి అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం సాకార సంఘం సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొమ్ము మధు, జడ్పిటిసి సుమిత్ర, డిసిసిబి చైర్మన్ వెంకటయ్య, డిసిఓ పత్యా నాయక్, డి సి ఏ ఓ రఘునాథరావు, సీఈఓ లక్ష్మయ్య, సింగిల్విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, వైస్



చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, సీఈవో ధర్మవీర్, సహకార సంఘం సభ్యులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

భూ కబ్జాను బయటపెట్టిన 'నవతెలంగాణ'

- నవతెలంగాణ కథనంపై పట్టణంలో చర్చ
- ఎమ్మెల్యే వంశీకృష్ణ స్పందించాలి
- కోటి విలువ చేసే స్థలం కబ్జా కుట్రను బయట పెట్టినందుకు పత్రికా విలేకరికి అభినందనలు

నవతెలంగాణ-అచ్చంపేట

ఆదివారం నవతెలంగాణ పత్రికలో ఈ ఆస్తికి వారసులు ఎవరు...! కోట్లు విలువ చేసే స్థలం గుడి పేరుతో కబ్జాకు యత్నం అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై పట్టణంలోని పలు టీ హోటల్, హెయిర్ కటింగ్, షాపులలో పలువురు చర్చించుకుంటున్నారు. స్థానిక ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు కొందరు రిపోర్టర్‌కు ఫోన్ చేసి కోట్లు విలువ చేస్తే స్థలం దేవాలయం నిర్వహణ కోసం అంటూ కొందరు కబ్జాకు చేసిన విషయాన్ని పట్టణ ప్రజలకు బహిర్గతం చేసినందుకు పత్రికకు అభినందనలు తెలిపారు. ఈ స్థలంలో ఉన్న గదిలో మహిళల చైతన్యం కోసం కార్యక్రమాలు నిర్వహించుకునే వారని స్థానికులు చెప్తున్నారు. అధికార బలాన్ని వినియోగించి రికార్డులు తారుమారు చేసి గుడి పేరుతో కబ్జాకు కుట్ర చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇంత బహిర్గతంగా విలువైన స్థలాను గుడి పేరుతో కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ప్రజా సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్



ముఖ్య నాయకుడు సబ్జా చేయడానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నారని తెలుస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.

అచ్చంపేటలో కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ భారీ మెజార్టీతో గెలుపొందారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన కబ్జాలను బహిర్గతం చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యే వంశీకృష్ణపైన ఉంది. కోట్ల విలువైన స్థలాన్ని దేవుని పేరుతో కబ్జా చేస్తున్నారు. ఈ అంశంపై ఎమ్మెల్యే స్పం దించి ఆస్తిని రక్షించి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



'బీటీ రోడ్డు పనులు నాణ్యతగా నిర్మించాలి'

నవతెలంగాణ- వెల్దండ

బీటీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా నిర్మించాలని నారాయణపూర్ మాజీ సర్పంచ్ అంజి నాయక్ అన్నారు. ఆదివారం హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నుండి మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు జరుగుతున్న నిర్మాణ పనులను మాజీ సర్పంచ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ షేసిపాల్ రెడ్డి, నాయకులు తరాసింగ్, లక్ష్మీపతి, సంతోష్, రమేష్, వసంత్, తదితరులు పాల్గొన్నారు.

నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్ : రామకృష్ణ



కందనూలు : బహుజన విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు కే.రామకృష్ణ ఆదివారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో విద్యకు 7.75శాతాన్ని నిధులు సరికాదని, ఈ నిధులు సరిపోవన్నారు. వాస్తవానికి విద్యకు 30శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 7.75శాతాన్ని కేటాయించడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేని ఫెస్టోలో 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి, నేడు 7.75శాతం కేటాయించడం సరికాదన్నారు. కాబట్టి కనీసం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం 15శాతం ఇస్తా మని చెప్పిన మాటనైనా నిలబెట్టుకోవడానికి పునరాలోచన చేసి సవరించి 15శాతం ఇవ్వాలన్నారు. గత బీఆర్ఎస్ పాలన వల్ల రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని బడ్జెట్‌లో యూనివర్సిటీలకు మౌలిక సదుపాయాల కోసం కేటాయించిన 500 కోట్లు ఏమాత్రం సరిపోవన్నారు. కాబట్టి ప్రతి యూనివర్సిటీకి 300 కోట్ల నుంచి వెయ్యి కోట్ల నిధులు కేటాయించి ఉన్నత విద్య పెంపుకు కృషి చేయాలన్నారు. కొత్తగా గురుకుల భవనాలు నిర్మాణం కాకుండా అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్‌లకు నూతనంగా నిర్మాణానికి కృషి చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకై కృషిచేసి విద్యా రంగంలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకై జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి నిరుద్యోగులకు అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు





నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ జన్మదిన వేడుకలను మాజీ సర్పంచ్ ఆదేర్ల వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీలు రవికుమార్, శశికళ శివశంకర్, మాజీ ఎంపీటీసీ దండు నరసింహ, సింగిల్ విండో అధ్యక్షులు బుడుగు శ్రీనివాస్ యాదవ్, యువ నాయకులు బాలింగాచారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం బాలికల గురుకుల పాఠశాలలో పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృదుస్వభావి, స్నేహశీలి, పిలిస్తే పలికే నాయకుడుగా కొద్ది కాలంలోనే పేరు తెచ్చుకున్న నాయకులలో ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ మొదటి వాడన్నారు. ఆయన సర్పంచు నుంచి ఎంపీపీగా ఎదిగి ప్రజల మన్ననలు పొందాడన్నారు. ఇంకా మరెన్నో ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవ చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మెరుగు రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తగిలి కృష్ణయ్య, సీపీఐ నాయకులు కందాల రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు పెద్దరాజు నక్కలపల్లి మల్లేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు బద్య నాయక్, ముచ్చబోతు శంకర్, బాలరాజ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో అభిమానం చాటుకున్న నవీన్..

ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ జన్మదిన%శీ% సందర్భంగా మండల పరిధిలోని మారేడుమాన్ దీన్నే గ్రామానికి చెందిన బోల్గం నవీన్ హైదరాబాదులోని కార్మాన్ ఘాట్ దగ్గరలోని లైఫ్ కేక్ హాస్పిటల్ లో రక్తదానం చేసి ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ పై తనకున్న ప్రేమను, అభిమానాన్ని చాటుకున్నారు ఎంతోమంది పేద ప్రజలకు ఆపద సమయంలో ఆదుకున్న మహానుభావుడు ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడు అని, ఆయన ఆయన జన్మదిన సందర్భంగా రక్తదానం చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు.



విద్యార్థుల ఆత్మహత్యలపై ..
సమగ్ర విచారణ జర్పించాలి : బీఎస్పీ



గట్టు : విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జర్పించాలని బీ.ఎస్.పీ పార్టీ గద్వాల ఇన్‌చార్జీ సునందు ఒక ప్రకటనలో కోరారు. భువనగిరి ఎస్సీ బాలికల వసతి గృహంలో భవ్య, వైష్ణవీల ఆత్మహత్యల ఘటనలు మరువకముందే సూర్యాపేట బాలిక గురుకుల పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న దగ్గుపాటి వైష్ణవి ఆత్మహత్యకు పాల్పడడం చాలా విషాదకరం. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీ "ఆరు గ్యారంటీల" మాట దేవుడెరుగు కానీ, దయచేసి తమ బిడ్డల ప్రాణాలకైనా ఇవ్వండి వసతి గృహాల్లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలపై తక్షణమే ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ప్రతి వసతి/ ఆశ్రమ/ గురుకుల పాఠశాలకు ఒక సైకాలజిస్టు లేదా కౌన్సిలర్‌ను వెంటనే నియమించాలని, సంఘటనకు కారకులైన వ్యక్తులను వెంటనే శిక్షించాలని, మృతురాలి కుటుంబానికి ఎక్స్ గ్రేషియాతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ అసోసియేషన్ జట్ల ఎంపిక

మరికల్ : నారాయణపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మరికల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నారాయణపేట జిల్లా సబ్ జూనియర్స్ బాల బాలికల జట్లను ఉదయం 9.30 గంటలకు ఎంపిక చేయనున్నట్లు నారాయణపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డోకూరి తిరుపతి రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీ.శాంతికుమార్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి వస్తున్నట్టు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్లు ఫిబ్రవరి నెల 16 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లా లోని చింతలపాలెంలో జరిగే 16వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు 20.03.2008 తరువాత జన్మించి ఉండాలి. 55 కిలోల బరువు కలిగి ఉండాలి. బోనాఫైడ్, పదవ తరగతి మెమో, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. మిగతా వివరాల కోసం 9908933358, 9985523534 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



పైప్‌లైన్ లీకేజీలు..!
- పట్టించుకోని అధికారులు
- అనారోగ్యాల బారిన ప్రజలు
- పైప్‌లైన్ లీకేజీలను సరిచేయాలని బహార్‌పేట వాసుల వేడుకోలు

నారాయణపేటటౌన్ : నారాయణపేట పట్టణంలోని బహార్‌పేట వీధిలో గత సంవత్సరం మిషన్ భగీరథ పైప్ లైన్ వేశారు. పైపుల ద్వారా నీరు ప్రజలకు అందుతుందా లేదా సంబంధిత అధికారులు చూడకుండానే సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మిషన్ భగీరథ పైపులో నీరు రావడంలేదని కొందరు ఫిర్యాదులు చేయగా సదరు కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి పైపులను సరి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ పైపుల ద్వారా నీరు లీకేజీ ద్వారా పైకి రావడం జరుగుతుందని, అదే నీరు మళ్లీ పైపులోకి మురికి నీరు కలుషితమై మళ్లి ప్రజలకు సరఫరా అవుతోంది. దీంతో ఆ నీటిని ప్రజలు తాగడం ద్వారా రోగాల బారిన పడే పరిస్థితి దాపురించింది. మిషన్ భగీరథ నీరు పేద, మధ్యతరగతి కుటుంబాలు మాత్రమే తాగుతున్న పరిస్థితి . అవేవి అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. సదరు కాంట్రాక్టర్ మరమ్మతులు చేసిన తర్వాత సంబంధిత అధికారులు పైప్‌లైన్ పనులు సక్రమంగా అయినవా లేదా అని చూసుకోకపోవడం గమనార్హం. బహర్ పేటలో రోడ్లను తవ్వి అలాగే వదిలేశారు. నూతనంగా వేసిన సీసీరోడ్లు గుంతలమయంగా తయారైంది. బాహర్‌పేటకు చెందిన ప్రజలు రోడ్డు తవ్వే సమయంలో గుంతల మయంగా మారిన రోడ్డును తర్వాత సరిచేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. సరే అని తర్వాత అలాగనే వదిలివేయడం ఎంతవరకు సమంజసం అని వీధి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా మిషన్ భగీరథకు సంబంధించిన అధికారులు ,మున్సిపల్ అధికారులు పైప్ లైన్‌కు మరమ్మతులు చేపట్టి స్వచ్ఛమైన నీటిని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వీధి ప్రజలు కోరుచున్నారు. ఇందుకు సంబంధించిన అధికారులు ఉన్నారా లేదా అని వీధి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నామమాత్రంగా పనులు చేస్తూ చేతులు దులుపు కొనుచున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో..
'సుకూర్ లింగంపల్లి'
- అధ్వానంగా రోడ్డు
- ఆందోళనలో గ్రామస్తులు



క్రిష్ణా : నారాయణపేటజిల్లా కృష్ణ మండలం రాష్ట్ర సరిహద్దున గల సుకూర్ లింగంపల్లి గ్రామం దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడంలేదు. ఐనాపూర్ గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న సుకూర్ లింగంపల్లి గ్రామంలో దాదాపు 450 జనాభా నివసిస్తున్నారు. మండల కేంద్రానికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం, తాగు నీరు, వైద్యం, విద్య నేటికి సరిగా అందడం లేదని పలువురు ఆరో పిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని భీమా నది మొట్ట మొదటిగా అడు గుపెట్టే గ్రామం సుకుర్ లింగంపల్లి ఇంతటి చరిత్ర గల గ్రామాన్ని పాలకులు , అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు రోడ్లు బురదమయంగా మారి గుంతలు ఏర్పడి ప్రయాణానికి నరకయాతన పడాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు, సరైన రోడ్డు సౌకర్యం లేక ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ప్రాణాలు గాల్లో కలిసిపోవాల్సిందేనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, పాలకులు గ్రామానికి అవసరమైన రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వివాహ వేడుకల్లో .. జెడ్పీచైర్‌పర్సన్



ధరూర్ : మండలంలో ఆదివారం జరిగిన వివాహ వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్పర్సన్ గద్వాల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. చిన్న పాడు గ్రామంలో అశోకా చారి , సంగీత , పార్చర్ల గ్రామంలో రామాంజనేయులు ,మహిత వివాహ వేడుకల్లో ఆమె హాజరయ్యారు. ధరూర్ మండల కేంద్రంలో మానస , రమేష్ , ధర్మ ,పల్లవిల వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఆమె వెంబడి మండల గ్రామస్థాయి , కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాల్లో .. ఎమ్మెల్యే

గద్వాల నియోజకవర్గం గద్వాల, కేటీదొడ్డి , గట్టు మండ లంలోని వివిధ గ్రామాల లో జరిగిన వేడుకల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనం తరం పలు గ్రామాల్లోని నూతన గృహప్రవేశాలు, నిశ్చితార్థలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే వెంబడి ఎంపీపీ విజయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గద్వాల తిమ్మప్ప, ఆయ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్‌సభ్యులు పాల్గొన్నారు.



నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంపై ..
ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ. సాగర్

నారాయణపేటటౌన్ : ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వ నిర్ణయం పట్ల సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ. సాగర్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గతకాల మంత కరువు వలసలతో తల్లడిల్లిన నారా యణపేట - కొడంగల్ ప్రాంతాలకు నారాయణపేట - కొడంగల్ ఎత్తి పోతల పథకం అమలుతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ ఆవిర్భా వించి దశాబ్ది కాలం బీఆర్ఎస్ ప్రభుత్వం నారాయణపేట ప్రాంతంను పట్టించుకోలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నపుడు మాట్లాడని కేటీఆర్ ప్రతిపక్షంలోకి వ చ్చిన తరవాత నారాయణపేట జిల్లా వలసలు అంబలి కేంద్ర ంపై మాట్లా డుతున్నారని అన్నారు. జీఓ నెంబర్ 69 ప్రకారం నీరు ఇవ్వాలని రాజకీయ పార్టీలతో పాటు సీపీఐ(ఎం) పాద యాత్రతో పాటూ అనేక పోరాటాలు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రాజెక్ట్ పనులు త్వరగా చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మద విధానాలు నిరసిస్తు ఫిబ్రవరి 16 న దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్‌కు సీపీఐ(ఎం) పార్టీ సం పూర్ణ మద్దతు తెలుపు తుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ (ఎం)నారా యణపేట జిల్లా కార్యదర్శి జీ. వెంకట్రామరెడ్డి , జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, బాల్ రామ్, సీపీఎం నాయకులు కాశప్ప, నరహరి, మల్లేష్, యాదగిరి, సుదర్శన్‌లు పాల్గొన్నారు.



బహుసుందరం 'అలంపూర్ క్షేత్రం'

– మైమర్పించే అద్భుత ఆలయ నిర్మాణాలు – చారిత్రక శిల్ప భాండాగారం అలంపూర్ శిల్ప సంపద

అలంపూర్- నవ తెలంగాణ

బహుసుందరమైన అలంపూర్ క్షేత్రం తెలంగాణ రాష్ట్రంలోనే గాక యావత్ భారత దేశంలోనే ప్రఖ్యాతిగాంచింది. అష్టాదశ శక్తి పీఠాల్లో ఒక టైన ఐదవ శక్తి పీఠం జోగులాంబాదేవి. నవ బ్రహ్మ ఆలయాల్లో ఒకటైన బాలబ్రహ్మేశ్వర ఆలయాలు ఈ క్షేత్రంల్లో ప్రధానమైన ఆలయాలు. జోగులాంబబాలబ్రహ్మేశ్వరులు ప్రధాన దేవతా ముర్తులు ఏడాదిలో మూడు సార్లు ఉత్సవాలు నిర్వహిస్తారు. దసరా సందర్భంగా దేవి శరన్నవ రాత్రులు, జోగులాంబదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు ,శివరాత్రి సందర్భంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.



ఇక్కడి ప్రధాన ఆలయాలు..

తుంగభద్రా నదీతీరంలో వెలిసిన అలంపూర్ క్షేత్రంలో అష్టాదశ శక్తి పీఠాలో ఒకటైన జోగులాంబదేవి ఆలయంతో పాటు బాలబ్రహ్మేశ్వర ,కుమారబ్రహ్మ అక్క బ్రహ్మ ,వీరబ్రహ్మ ,విశ్వబ్రహ్మ ,స్వర్గబ్రహ్మ, పద్మబ్రహ్మ తారకబ్రహ్మ, గరుడబ్రహ్మ, అనే నవ బ్రహ్మ ఆలయాలు ఉన్నాయి.వీటితో పాటు అత్యంత ప్రఖ్యాతిగాంచిన సంగమేశ్వర ఆలయంను శ్రీశైలం ప్రాజెక్టు నిల్వ నీటితో శిథిలంకాకుండా ఉండేందుకు అక్కడి రాతి నిర్మాణాలను తీసుకు వచ్చి అలంపూర్ లోని విశాలమైన మైదానంలో యథాతథంగా పునర్‌నిర్మాణం చేశారు. వీటితో పాటు సుందరమైన గోపురాలతో నిర్మితమైన పాపనాశ్వేశ్వర ఆలయాలు, నరసింహ్మ , సూర్యనారాయణ, ఆలయాలున్నాయి.ఇవేకాక నదీతీరంలో కోటి లింగాలు,వంద ఆలయాలు, ఉపాలయాలు,26 తీర్థాలు, స్నాన ఘట్టాలు, శ్రీశైల ప్రాజెర్టు ‹ర్మాణ అనంతరం నదీగర్భంలో కలిసిపోయాయి. అలంపూర్‌లోని నవబ్రహ్మ ఆలయాలను బాదామిచాలుక్యులు 6వ శతాబ్దం నుంచి 7వ శతాబ్దం వరకు నిర్మించారని, ఆలయ నిర్మాణం, అభివృద్ధి చేసేందుకు దాదాపు 200 సంవత్సరాలు పట్టిందని చారాత్రక ఆదారాలు చెబుతున్నాయి.జోగులాంబదేవి ఆలయం 14వ శతాబ్దంలో ధ్వంసమైపోగా దేవి విగ్రహాన్ని బాలబ్రహ్మేశ్వర ఆలయంలోని చిన్న గూటిలో 700 సంవత్సరాలు ఉంచారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ జోగులాంబదేవికి నూతన ఆలయాన్ని నిర్మించి 2005లో పునఃప్రతిష్ఠించారు. పూర్వం ఈ ప్రాంతాన్ని బాదామి చాళుక్యులు, శ్రీకృష్ణదేవ రాయలు, కుతుబ్‌షాహిలు, నిజాం నవాబు తదిత రులు పాలించారు. తర్వాత ఈ ప్రాంతం అఖండ భారతంలో విలినమైంది. 1884లో శిథిలావస్థలో ఉన్న ఆలయాలను నెల్లూరుకు చెందిన గంద్రకోట కుమార స్వామి అభివృద్ధి చేశారు.1916లో ధర్మకర్తల మండలి ఏర్పడింది.

చారిత్రక భాండాగారంగా మ్యూజియం..

కేంద్ర పురావాస్తుశాఖ ఆద్వర్యంలో ఆలయ ప్రాంగణంలో మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఈ మ్యూజియంలో 6 నుంచి 12 వ శతాబ్దం వరకు భారతీయ సంస్కృతిలో వచ్చిన పరిణామాలు తెలియజేసే విదంగా శిల్పాలు ఉన్నాయి. ఈ శిల్పాలు 7వ శతాబ్దం నుంచి 1వ శతాబ్దం వరకు దక్షిణ ప్రాంతాన్ని పాలించిన రాజవంశీయుల శాసనాలున్నాయి. పురావాస్తు శాఖ మ్యూజియంలో సుందర మనోహర విగ్రహాలు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి మహిషాసుర వర్ధిని విగ్రహ ముఖంలో ఓ చెంప రౌద్రం, మరో చెంప చిరునవ్వు చిందించేలా చెక్కిన తీరు అద్భుతం.ఇక్కడి మరో విగ్రహం నందీశ్వరుడిపై పార్వతీ పరమేశ్వరులు ఉండే విగ్రహం దేశంలో మరెక్కడాలేదనిపురావాస్తుశాఖ వారు చెబుతున్నారు. ఈ విగ్రహాలో కొన్నింటికి ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా జర్మనీలో 1984లో నిర్వహించిన విగ్రహాల ప్రదర్శనలో సూర్య విగ్రహానికి, 1977లో లండన్‌లో నిర్వహించిన ప్రదర్శనలో నటరాజ విగ్రహానికి, 2008లో బెల్జీయంలో ‹ర్వహించిన ప్రదర్శనలో నాగ విగ్రహాలు ప్రపంచస్థాయిలో సుందరమైన విగ్రహాలుగా గుర్తించబడి అలంపూర్ చరిత్రను ప్రపంచస్థాయికి చాటి చెప్పాయి. మ్యూజియంలో మొత్తం 188 శిలా విగ్రహాలు, 26 శిలా శాసనాలు, ఉన్నాయి. ఇందులో కొన్ని ఎర్ర ఇసుకరాతితో మరికొన్ని గ్రానైట్, కొన్ని నల్లరాతితో చెక్కిన ఆధారాలు భద్రపరచబడిన్నవి.

రవాణ తదితర సౌకర్యాలు..

దక్షిణ కాశీగా పేరుగాంచిన అలంపూర్ క్షేత్రాన్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు జోగులాంబ రైల్వేస్టేషన్,44వ జాతీయరహదారిపై ఉన్న అలంపూర్ చౌరస్తా నుంచి అలంపూర్ వరకు బస్సు సౌకర్యం కలదు. ఇక్కడ వసతికిగాను తెలంగాణ టూ రిజం గెస్ట్ హౌస్, ఆలయంలో నిత్య అన్నదాన సత్రం ,ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, పంచాయితీరాజ్ గెస్ట్ హౌస్‌లు సౌకర్యవంతంగా ఉన్నాయి.

అనుమానితులు సంచరిస్తే..
సమాచారం ఇవ్వండి : ఎస్పీ



నారాయణపేటటౌన్ : నారాయణపేట జిల్లా పరిధిలో దొంగతనాల నిర్మూలనపై పోలీస్ పెట్రోలింగ్ పెంచడం జరిగిందని, గ్రామాలలో, పట్టణ కేంద్రంలోని కాలనీలలో ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు సంచరిస్తే.. వెంటనే పోలీస్ వారికి డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూమ్ నం.8712670399 కి, లేదా సంబంధిత లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.పోలీస్ స్టేషన్ల పరిధిలో పూర్తిస్థాయి పెట్రోలింగ్ పెంచడం జరిగిం దని పెట్రో కార్ పెట్రోలింగ్, బ్లూ కోట్స్ పెట్రోలింగ్, మఫ్టీలో పోలీసులను , టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దొంగతనాల నిర్మూలనకు పూర్తిస్థాయి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పాత నేరస్తుల పై నిఘా ఏర్పాటు చేసి ప్రతిరోజు వారిని తనిఖీ చేయడం జరుగుతుందని, ప్రజలు ఎవరైనా గ్రామాలలో ఎక్కువ రోజులు ఇండ్లకు తాళం వేసి టూర్లు లేదా బంధువుల ఊర్లకు వెళ్లినచో సంబంధిత లోకల్ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని , అయ ఏరియాల్లో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలించడానికి అవకాశం ఉంటుందని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



గట్టు : మండల కేంద్రంలోని కేజీవీబీ పాఠశాలలో 2024-25కి సంబంధించిన గురుకుల ఎం ట్రన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు ఆకస్మీకంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రానికి 264 మంది విద్యార్థులకు గాను 245 మంది విద్యార్థులు హాజరైనట్లు కేజీవీబీ ప్రిన్సిపాల్ గోపిలత తెలిపారు.

విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్



అయిజ : తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 30 నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ డిమాండ్ చేశారు. ఆదివారం అయిజ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ మాట్లాడుతూ నిన్న జరిగిన నూతన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశాలలో బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వ విద్య బలోపేతం కొరకు కొఠారి కమిషన్ ద్వారా విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను కాపాడాలని కోరారు. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్ లో 30శాతం నిధులు కేటాయించాలని, యూనివర్సిటీల బలోపేతంకు ప్రత్యే కంగా నిధులు కేటాయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. హాస్టల్స్ లో మౌలిక సదుపాయాలు కల్పించి మెస్ చార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. అద్దె భవనాలకు సొంత భవనాలు నిర్మించాలని, కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలని, ఉన్న వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 నిలిపివేస్తూ అసెంబ్లీ తీర్మానం చేయాలన్నారు. విద్యాసంస్థలల్లో మతబోధనలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు చందు, చరణ్, స్తుతి కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం..



ఊట్కూర్ : మక్తల్ పట్టణంలో వెలిసిన వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం వాసవీ మాతకు అభిషేకం, అష్టోత్తర శతనామావళి, సామూహిక కుంకుమార్చన, పడమటి ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర అన్నదానం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో వాసవీ దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్త, అధ్యక్షులు కట్ట సురేష్ , మనసాని నాగరాజ్ , కొత్త సుజిత్, చిగుళ్లపల్లి రాఘవేంద్ర, ఆలంపల్లి వెంకటేష్ , మనసాని రంజిత్ కుమార్, మనసాని వెంకటేష్ , మనసాని కిరణ్ , బీచాన రఘువీర్ , శెట్టి శ్రీనివాస్ , మహిళా సంఘం కొత్త మీరాబాయి, మహిళా సంఘం అధ్యక్షురాలు మనసాని సరళ, సుజాత,పల్లవి,వాసవి క్లబ్ పాలుట్ల బాలరాజ్, కల్వాల్ కిషోర్, శెట్టి శ్రీనివాస్ ,వాసవీ, వనిత క్లబ్ కల్వాల్ ప్రసన్న , సుష్మజ్యోతి, దేవి, శారదా, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మరికల్ : మరికల్ మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మరికల్ కనక పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం , పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు కందూరి సత్యనారాయణ శెట్టి,ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు ఇల్లూరి రమేష్ ,పూరి గణేష్, వైడి గుప్తా, సుగ్గయ్య శెట్టి, పూరి రాజు ,పాలుట్ల శ్రీనివాసులు, దత్తు ,నాగరాజు,పాండు, మధు శేషాద్రి, సింహాచలం, అశోక్, విజయ్ కుమార్, వెంకటేష్, శేషి ,సూరేష్, శ్రీహరి, తదితరులు, మహిళలు, ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాయకులకు సన్మానం



అయిజ : భావి భారత ప్రధాని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడు న్యాయయాత్ర సందర్భంగా తిక్క వీరేశ్వర స్వామి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతున్న సందర్భంగా జిల్లా క్రికెటర్ అసోసియేషన్ అధ్యక్షులు, టీఎస్పీఎల్ మొదటి , రెండో బహుమతి ప్రదాత మురారి సోమశేఖర్ రెడ్డిని, అయిజ ఎస్సై బీ నరేష్ కుమార్‌ని, కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు అడ్వకేట్ సురేష్ గౌడ్, ఐజ మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ ఎస్ జి. రనెమ్మ జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి యూ.ఎస్. హనుమన్నలతో పాటు తదిత రులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. వారిని టీపీసీసీ అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి శాలువాలతో సత్కరించి మెమెంటో బహుకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ కార్యదర్శి ఫిరోజ్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సాంబశివుడు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్. సుందర్ రాజు జిల్లా జనరల్ సెక్రెటరీ పులికల్ దేవన్న , బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సీ. మధు, కాంగ్రెస్ పార్టీ టౌన్ ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి , కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ టౌన్ అధ్యక్షులు బసవరాజు , మండల ఉపాధ్యక్షుడు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

దాసరి కొండయ్యకు సన్మానం

ఊట్కూర్ : బలగం సినిమాలో పాట పాడిన వంటి దాసరి కొండయ్యను 31 టీవీ బృందం ఆధ్వర్యంలో దామరగిద్దలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 31 టీవీ బృందం సభ్యులు చెన్నయ్య లక్ష్మణ్ శంకర్ బాలరాజ్‌తో పాటు తదిత రులు పాల్గొన్నారు.

